క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ఏకపాత్రాభినయ పోటీలు

చిలకలూరిపేటటౌన్: ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి పౌరాణిక, సాంఘిక, జానపద ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ కార్యదర్శి, కళాస్రవంతి వ్యవస్థాపక అధ్యక్షుడు జంపని భాస్కరరావు చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం రోజు జనవరి ఒకటోతేదీ ఉదయం 10 గంటలకు కేబీ రోడ్డులోని జంపని భాస్కర్ సినీ కల్యాణమండపంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో విజేతలకు ప్రథమ రూ. 5వేలు, ద్వితీయ బహుమతి రూ. 4వేలు, తృతీయ బహుమతి రూ. 3వేలతో పాటు మూడు కన్సోలేషన్ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు ఏవీ శివయ్య సెల్ నంబర్ 9493775555 కు సంప్రదించాలన్నారు.

విద్యుత్ అధికారుల దాడులు

చిలకలూరిపేట: సీఆర్‌డీఏ సర్కిల్ విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.విజయకుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో అనధికార విద్యుత్ వినియోగానికి సంబంధించి తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సీహెచ్ రమేష్, సీహెచ్ రాంబొట్లు, ఎల్ఎన్ మూర్తి నేతృత్వంలో మొత్తం 32 బృందాలుగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అదనపు లోడు వినియోగిస్తున్న 74 మందిని గుర్తించి రూ. 7.52 లక్షలు, అనధికార విద్యుత్ వినియోగిస్తున్న ఏడుగురిపై రూ. లక్ష, మొత్తం 81 సర్వీసులకు సంబంధించి రూ. 8.52 లక్షలు అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట డీఈఈ ఆర్ అశోక్‌కుమార్, ఏఈఈ పి.భార్గవి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డీఈఈలు, ఏఈఈలు మొత్తం 15 మంది అధికారులు పాల్గొన్నారు.

తపాల బీమా చెక్కు అందజేత



నరసరావుపేట టౌన్: తపాల జీవిత బీమా పొందిన దంపతుల్లో భార్య మృతి చెందటంతో భర్తకు చెక్కును అందజేసినట్లు డివిజనల్ హెడ్ పోస్టల్ సూపరింటెండెంట్ పి. వెంకటస్వామి తెలిపారు. బుధవారం తపాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ మాట్లాడుతూ లింగంగుంట్లకు చెందిన తంగెళ్ల వెంకటేశ్వర్లు, లక్ష్మీలు 2019 నుంచి యుగళ సురక్ష పాలసీని తీసుకొని ప్రతి నెలా రూ.5500 లు చెల్లిస్తున్నారన్నారు. ఈ క్రమంలో లక్ష్మీ ఈ ఏడాది అక్టోబర్ 9వ తేదీన అకస్మాత్తుగా మృతి చెందిందన్నారు. దీంతో వారికి రూ.12 లక్షల రూపాయల బీమా సొమ్ము చెక్కును అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ జి. శ్రీనివాసరావు, డీవో ఆర్‌పీ. రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలే బీమాకు ప్రామాణికం



వినుకొండ(నూజెండ్ల): పంట కోత ప్రయోగాల ఫలితాల ప్రామాణికంగానే రైతులకు బీమా వర్తిస్తుందని ఏడీఏ బోయపాటి రవిబాబు తెలిపారు. మండలంలోని వి.అప్పాపురం గ్రామంలో తియ్యగురా గోవిందరెడ్డి వరి పొలంలో పంట కోత ప్రయోగాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కోత ప్రయోగాన్ని నిర్వహించగా దిగుబడి ఎకరానికి 25 బస్తాలు వస్తాయని అంచనా వేసినట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా వరి పంటలో 174 పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రబీ సీజన్‌లో పంట నమోదు, ఈకేవైసీ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంటల బీమా కంపెనీ ప్రతినిధి సీహెచ్. శ్రీను, గ్రామ వ్యవసాయ సహాయకులు పి.అశోక్, వి.రేవంత్, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యబీమాపై అవగాహన

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్లాప్ మిత్రలకు ఐటీసీ బంగారు భవిష్యత్, సెర్ప్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆరోగ్య బీమాపై బుధవారం అవగాహన నిర్వహించారు. క్లాప్ మిత్రలు ఆరోగ్య సంరక్షణ బీమా సౌకర్యాలను సద్వినియోగపరచుకోవాలని ఐటీసీ సంస్థ ప్రతినిధి ప్రదీప్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీబాషా, మండల ఎంఆర్‌సీ నాగేశ్వరరావునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బృందాలకు రైతులు సహకరించాలి

శావల్యాపురం: మిచాంగ్ తుఫాన్ ధాటికి గ్రామాల్లో పంటలు నష్టం వాటిల్లిన రైతులు బృందాలకు సమగ్ర వివరాలు తెలియజేయాలని వినుకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) బోయపాటి రవిబాబు అన్నారు. బుధవారం మండలంలోని పొట్లూరు గ్రామంలో దెబ్బతిన్న పంట పొలాలను వ్యవసాయ అధికారులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్నీ గ్రామాల్లో పంట నష్టం అంచనా వేయడానికి బృందాలు పర్యటిస్తున్నారని, నష్టం వాటిల్లిన ప్రతి రైతుకు పరిహారం అందేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు.

అధైర్యపడొద్దు...అండగా ఉంటాం

- అగ్నిప్రమాదానికి గురైన గృహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి
- రూ.25 వేలు నగదు, 100 కేజీల బియ్యం అందజేత



బాధితులకు బియ్యం, నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

నరసరావుపేట: అగ్నిప్రమాద బాధితులకు ప్రభుత్వం అండగా ఉండి ఆర్థికంగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ఒకటో వార్డులో విద్యుదాఘాతంతో అగ్నికి ఆహుతైన అంబటి ఫణికుమార్, ప్రమీలా గృహాన్ని పరిశీలించారు. అగ్నిప్రమాదం జరిగిన తీరును వారిని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు రూ.25 వేల ఆర్థిక సహాయంతో పాటు 100 కేజీల బియ్యం, అందజేసి వంటసామగ్రి కూడా అందజేస్తామని హామీ ఇచ్చారు.. ఈసందర్భంగా మాట్లాడుతూ ఒకటో వార్డు గానుగుల బజారులో నివాసం ఉంటున్న ఫణీంద్ర కుమార్ గృహం అగ్నికి పూర్తిగా ఆహుతైందన్నారు. విషయం తెలిసిన వెంటనే తహసీల్దార్, ఆర్ఐలను పంపించటంతో వారు నివేదిక ప్రభుత్వానికి పంపారన్నారు. మానవతా దృక్పథంతో ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాల్సిన బాధ్యత తమకు ఉందన్నారు. ఇటువంటి సంఘటనలు జరగటం బాధాకరమన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయం కూడా కృషి చేస్తామన్నారు. జగనన్న కాలనీలో ఇంటిస్థలం మంజూరు చేయించి ఇల్లు కట్టించి ఇస్తామన్నారు. ఎక్కడ ప్రజలకు ఆపద ఎదురైనా వారిని తమ పార్టీ ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, ఒకటో వార్డు నాయకులు నాగారపు ఆంజనేయులు, రామిశెట్టి కొండ, షేక్ మాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎస్ఏ స్టేడియం అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, డిప్యూటీ డీఈఓ వేణుగోపాలరావు

నరసరావుపేట ఈస్ట్: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియాన్ని మరింతగా అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీలను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి సందర్శించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టేడియంలో వాలీబాల్, బాస్కెట్‌బాల్ తదితర క్రీడలు ఆడేందుకు బహుళ ప్రయోజనకారిగా ఉండేలా ఇండోర్ స్టేడియాన్ని త్వరలో నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే సింథటిక్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. సైనిక్ స్కూల్ చదువుకున్న తనకు క్రీడల పట్ల ఆసక్తి మెండు అని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఏదో ఒక ఆటలో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడల ప్రాధాన్యతను విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించి ఉత్తమ క్రీడాకారులను తయారు చేయాలని కోరారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరిస్తు జీవితంలో ఉన్నతంగా ఎదగాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆడుదాం ఆంధ్రా పేరుతో మెగా క్రీడా టోర్నమెంట్‌ను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నదని వివరించారు. క్రీడలలో ప్రతిభ చూపి రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలతో గౌరవిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ వేణుగోపాలరావు, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సి.హెచ్.కోటేశ్వరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళా ఉత్సవాలను జయప్రదం చేయండి

నరసరావుపేట ఈస్ట్: అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సామాజిక సేవాసంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 16, 17తేదీలలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో 30గంటల పాటు నిరవధికంగా జరగనున్న ప్రపంచ తెలుగు సాహిత్య- కళా ఉత్సవాలను జయప్రదం చేయాలని కళావేదిక జాతీయ కార్యదర్శి గుండాల రాకేష్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి ఆధ్వర్యంలో జరగనున్న ఉత్సవాలలో కవులు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. దూరప్రాంతాల నుంచి హాజరయ్యే కవులు, కళాకారులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించటంతో పాటు ప్రతి ఒక్కరిని శాలువా, మెమెంటో, సర్టిఫికెట్‌తో సత్కరించనున్నట్లు తలిపారు.

తపాల ఉద్యోగుల నిరవధిక సమ్మె



నరసరావుపేట టౌన్: ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోరుతూ తపాలా ఉద్యోగులు బుధవారం డివిజన్ హెడ్ పోస్టాఫీస్ వద్ద నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా యూనియన్ నరసరావుపేట డివిజన్ చైర్మన్ పీవీ నారాయణ మాట్లాడుతూ 8 గంటల పనితో పాటు పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు కల్పించాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్‌కు రూ.5 లక్షలు, గ్రాట్యూటీ రూ.5 లక్షలు పెంచాలన్నారు. రెగ్యూలర్ జీడీఎస్‌లు సెలవు పెట్టినప్పుడు వర్క్‌లోడ్‌తో సంబంధం లేకుండా సబ్‌స్టిట్యూట్‌ని అనుమతించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అజయ్‌కుమార్, టి. సురేష్‌బాబు, వై. పాపిరెడ్డి, షేక్ జాన్ పీరా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు



రొంపిచర్ల: మండలంలోని వడ్లమూడివారిపాలెం గ్రామంలో గల ఏసుక్రీస్తు కృపా ప్రార్థన మినిస్ట్రీస్ చర్చిలో బుధవారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న చర్చి పాస్టర్లు జోసఫ్, సామ్యేలు, సాల్మన్ రాజు క్రీస్తు బోధనలు గురించి వివరించారు. క్రీస్తుపై ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. కొవ్వొత్తులను ప్రదర్శించి సెమీ క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. అదే విధంగా నూతన సంవత్సరం క్యాలెండర్లును ఆవిష్కరించి పంపిణీ చేశారు. అనంతరం పేదలకు, మహిళలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ఎం.వీరారెడ్డి, మస్తాన్‌రావు, సంఘస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సొలస ఆర్‌అండ్‌బీ రోడ్డుపై భారీగండి



యడ్లపాడు: మిచాంగ్ తుఫాన్ కారణంగా మండలంలోని సొలస గ్రామం పరిధిలో నక్కవాగు వంతెన వద్ద ఆర్అండ్‌బి రోడ్డుకు భారీ గండి ఏర్పడింది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు, పంట పొలాలు, కొండవాగుల నీరు కలిసి నక్కవాగులో కలవడంతో ప్రవాహం ఉధృతమైంది. ఇక్కడి లోలెవల్ వంతెనపై నుంచి భారీగా నీరు పారింది. దీంతో ఒకరోజు పాటు సొలస నుంచి కొత్తసొలస వైపుకు వెళ్లే మార్గం జలదిగ్బంధమై రాకపోకలు పూర్తిగా నిలిచాయి. ఈ నేపథ్యంలో ఏర్పడిన భారీ గండి కారణంగా ఈ మార్గం ప్రమాదకరంగా మారింది. అధికారులు గండి పూడ్చడంపై ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇదే విషయాన్ని మాజీ ఎంపీపీ ఎంవీ బాలచంద్రారెడ్డి ఆర్‌అండ్‌బిశాఖ అధికారుల దృష్టికీ తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

దీపాలుచూపి.. స్వర్గానికి సాగనంపి



కోదండ రామస్వామి ఆలయంలో దీపోత్సవ కార్యక్రమం



బాలమ్మ బజారులో పోలిస్వర్గం ప్రత్యేకపూజలు చేస్తున్న మహిళలు



పాతూరు శివాలయంలో అన్నాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

వినుకొండ(నూజెండ్ల): కార్తిక మాసం పూర్తయిన సందర్భంగా పట్టణంలోని కొత్తపేటలో గల బాలమ్మ బజారులో బుధవారం ఉదయం పోలి స్వర్గం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మహిళలు ప్రత్యేక పూజలతో ఏర్పాటు చేసుకున్న కోనేరులో శివలింగాన్ని ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో దీపాలు కోనేరులో వదిలారు. కార్యక్రమంలో 5వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి సచివాలయ కన్వీనర్ అర్చనామూర్తి, మురళి, శ్రీనివాసరావు, సత్యానారాయణ, సుజాత, సుధ, లక్ష్మి, శిరీష, ఉష, వసుంధర పాల్గొన్నారు.

పట్టణంలోని పెద్ద పోస్టాఫీస్ వద్ద గల పాత శివాలయం శ్రీ ప్రసన్న రామలింగేశ్వరస్వామి దేవస్థానం, శ్రీ కోదండ రామస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కార్తిక మాసం సందర్భంగా 15 అడుగుల వెడల్పు, 30 అడుగుల పొడవుతో 3వేల ప్రమిదలతో దీపారాధన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓం నమశ్శివాయ స్వరాలతో ఆలయ ఆవరణం మార్మోగింది. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జ్యోతులను వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొల్లిపర బాలసుబ్రహ్మణ్యం, వెల మూరి వెంకటశేషసాయి, తెలగంశెట్టి పావనిదేవి, కుందుర్తి సంపూర్ణ, గంజి తిరుమలమ్మ, భక్తులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: పవిత్ర కార్తిక మాసం ముగింపును పురస్కరించుకుని బుధవారం మహిళలు పోలిస్వర్గం పూజలు నిర్వహించారు. వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించిన మహిళలు తమతమ గృహాలలో కార్తిక దీపాలను వెలిగించి నీటిలో దీపాలను వదిలి సమీపంలోని శివాలయాలలో పూజలు జరిపారు. కొందరు మహిళలు కాలనీ శివాలయం వద్ద నున్న సాగర్ కాలవలోని కొద్దిపాటి నీటిలో కార్తిక దీపాలను వదిలి పూజలు నిర్వహించారు. పాతూరులోని శ్రీభీమలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. రావిపాడురోడ్డులోని శ్రీకళ్యాణ సుందరేశ్వర స్వామి ఆలయం, బరంపేటలోని శ్రీవాయు మల్లేశ్వరస్వామి ఆలయం, శ్రీశృంగేరి శంకరమఠంలోని శ్రీశంకర చంద్రమౌళీశ్వరస్వామి ఆలయాలలో భక్తులు పూజలు నిర్వహించారు.

ట్రాఫిక్ నియంత్రణ గేట్లు అందజేత



ట్రాఫిక్ నియంత్రణ గేట్లను ఆలయానికి అందజేస్తున్న నాగార్జున సిమెంట్ ప్రతినిధులు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారికి నాగార్జున సిమెంట్ యాజమాన్యం 20 ట్రాఫిక్ నియంత్రణ గేట్లను అందజేసింది. ఆలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నాగార్జున సిమెంట్ ప్రతినిధులు ఏజీఎం సుబ్బారావు, రవీంద్రలు గేట్లను ఆలయ ఈఓ జి.శ్రీనివాస రెడ్డికి అప్పగించారు. కొండపై ఆలయ ప్రాంగణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు గేట్లు ఎంతో ఉపయోగపడతాయని ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రధానంగా మహాశివరాత్రి పర్వదినాన నిర్వహించే తిరునాళ్లకు వచ్చే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్‌ను మళ్లించేందుకు ఉపయోగపడతాయని వివరించారు. నాగార్జున సిమెంట్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు మట్టా లింగారెడ్డి, వంపుగుడి జానకయ్య, మాడిశెట్టి స్వర్ణలత, గుంటూరు లక్ష్మీ, మాజీ ట్రస్టుబోర్డు సభ్యుడు ముక్కు వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.



చిలకలూరిపేట వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన మల్లెల రాజేష్ నాయుడు బుధవారం గుంటూరులో శాసనమండలి విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్రంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

-సాక్షి, గుంటూరు

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



యడ్లపాడు: విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. మండలంలోని ఉన్నవ గ్రామం ఉదయపురి కాలనీకు చెందిన దంటూ సభాపతికి నాలుగు గేదెలు ఉన్నాయి. బుధవారం సమీపంలోని జగనన్న కాలనీలోకి తన గేదేల్ని మేపుకుంటుండగా, అక్కడే ఉన్న విద్యుత్ స్తంభం నుంచి కిందకు వేలాడుతున్న తీగ ఓ పాడిగేదెకు తగిలింది. విద్యుత్ సరఫరా ఉండటంతో గేదెకు షాక్ తగిలి పెద్దగా అరిచి కిందపడిపోయింది. స్థానికుల సాయంతో కర్రతో గేదెకు తగిలిన విద్యుత్ తీగను తొలగించారు. కానీ అప్పటికే గేదె మృత్యువాత పడింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు సత్వరమే సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రూ.80 వేల విలువైన తన పాడిగేదె మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపాడు. జీవన ఆధారమైన గేదెను కోల్పోయిన తనకు న్యాయం చేయాలంటూ తిమ్మాపురం పశువైద్యాధికారి, యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు.

పథకాల అమలులో వలంటీర్లదే కీలకపాత్ర

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల) : ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వలంటీర్లదే కీలకపాత్ర ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని కారంపూడి రోడ్డులో బొల్లా బ్రహ్మనాయుడు కన్వెన్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని నూజెండ్ల మండల వలంటీర్లు, గృహసారధులు, సచివాలయాల కన్వీనర్ల ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేనివిధంగా వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారని, స్వచ్ఛందంగా సేవ చేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అలాగే నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులను కూడా ప్రజలకు తెలియజేయాలన్నారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు రానివారిని గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో వినుకొండ నియోజకవర్గంలో వందల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో వినుకొండ నియోజకవర్గాన్ని రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. వినుకొండ ప్రాంత వాసిగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అనంతరం కానుకలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహసారధులు, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా ఏపీ

- గణపవరంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం
- రూ.22.17 కోట్ల మేర మేలు



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న వైస్‌చైర్మన్ వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు, నాయకులు

నాదెండ్ల: దేశంలోనే ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ఏపీని సుపరిపాలనకు చిరునామాగా నిలిపిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ప్రజలు పట్టం కట్టాలని మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు చెప్పారు. గణపవరం 4వ సచివాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శి జ్యోతిర్మయి అధ్యక్షతన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వ హించారు. నాలుగున్నరేళ్ళలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సచివాలయం పరిధిలో రూ.22, 17,37,722లు మేలు జరిగిందన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ మేలు జరిగి ఉంటేనే మద్దతు ఇవ్వండని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పటం ఈ రాష్ట్రానికి ఆయన చేసిన సంక్షేమం, అభివృద్ధి ఎంత గొప్పగా ఉందో అర్థమౌతుందన్నారు. విద్యా, వైద్య రంగాల్లో నాడు నేడు ద్వారా సమూల మార్పులు చేసి కార్పొరేట్ స్థాయిని తలదన్నేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ అన్ని రంగాల్లో మహిళలకు సమచితస్థానం ఇచ్చారన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లో జనాభా వారీగా భాగస్వామ్యం కల్పించటం ఒక్క జగన్‌కే సాధ్యమైందన్నారు. బ్రిటీష్ జమానాలో జరిగిన భూముల సర్వేను, శతాబ్దం అనంతరం జగనన్న భూహక్కు భూ రక్ష కార్యక్రమంలో రీసర్వే చేస్తున్నారన్నారు. దీంతో ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న భూవివాదాలు పరిష్కారమై యజమానులకు తమ భూములపై పక్కాగా హక్కు కలుగుతుందన్నారు.

గతంలో సామాజిక భద్రతా పింఛను పొందాలంటే ఆ ఇంట్లో ఎవరో ఒకరు పోవాలి తప్ప పింఛను వచ్చేది కాదన్నారు. పింఛను కూడా క్యూలో నిలబడి తీసుకోవాలంటే లబ్ధిదారులు ఎంతో నరకయాతన పడాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ఈ ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా 1వ తేదీ నుంచి 5వ తేదీలోగా గడప వద్దకు వచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. వచ్చే జనవరి నుంచి రూ.3 వేలు పింఛను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తులం సుధాకర్, షేక్ ఆదంవలి, పంచాయతీ కార్యదర్శులు ఎ.శేఖర్, కవిత, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, నాయకులు కాటా వెంకటేశ్వర్లు, బొప్పూడి రామారావు, పీఎంసీ చైర్మన్ శంకరరెడ్డి, అవ్వారు సుబ్రహ్మణ్యం, ఆముదాలపల్లి ఆంజనేయులు, అనిశెట్టి కోటేశ్వరరావు, షేక్ సుభాని, బాజీ, సచివాలయ కన్వీనర్లు గాలి హనుమంతరావు, పెంటేల వీరయ్య, షేక్ రసూల్‌బీ, చిలకలూరిపేట జేఏసీ కన్వీనర్ రవి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్



కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రంగనాయకులు, సిబ్బంది



కారుమంచిలో మైదానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నాదెండ్ల: ఈ నెల 15 నుంచి జనవరి 1వ తేదీ వరకూ సచివాలయ పరిధిలో ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ చెప్పారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఉన్నత పాఠశాలల పీడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని, సచివాలయాల పరిధిలో ఆటస్థలాలను ఎంపిక చేసుకుని క్రీడలు ప్రారంభించాలన్నారు. సచివాలయం పరిధిలో 18 రోజులు జరుగుతాయని, మండలస్థాయిలో 14 రోజులు, నియోజకవర్గస్థాయిలో 6 రోజులు, జిల్లాస్థాయిలో 7 రోజులు, రాష్ట్రస్థాయిలో 6 రోజులు పోటీలు జరగనున్నట్లు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్‌లో పోటీలు జరుగుతాయన్నారు. నియోజకవర్గస్థాయిలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.35 వేలు, జిల్లా స్థాయిలో రూ.60 వేలు, రాష్ట్రస్థాయిలో రూ.5 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, రూ.30 వేలు, రూ.3 లక్షలు, తృతీయ బహుమతి రూ.5 వేలు, రూ.10 వేలు, రూ.2 లక్షలు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. జనవరి 26వ తేదీ వరకూ పోటీలు జరుగుతాయన్నారు. 15 ఏళ్లు పైబడిన విద్యార్థులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఈమని కృష్ణారెడ్డి, చిరుమామిళ్ళ పీడీ, మండల కోఆర్డినేటర్ నాగరాజు ఉన్నారు.

ఆడుదాం ఆంధ్ర కిట్ల పంపిణీ

ఈపూరు: ఆడుదాం ఆంధ్ర యువతకు ఎంతో ఉత్సాహం నింపుతుందని ఎంపీడీవో రంగనాయకులు అన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని అన్ని సచివాలయాలకు స్పోర్ట్స్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ఈ కార్యక్రమం కింద ఆటల పోటీలు సచివాలయస్థాయిలో, మండలస్థాయిలో, జిల్లాస్థాయిలో జరుగుతాయని, అనంతరం బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శాకమూరి బుచ్చయ్య, ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా మైదానాలు సిద్ధం

శావల్యాపురం: ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఈనెల 15 నుంచి గ్రామ సచివాలయాల పరిధిలో జరగనున్న క్రీడా పోటీలకు క్రీడామైదానాలు సిద్ధం చేస్తున్నట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. బుధవారం మండలంలోని పొట్లూరు, మతుకుమల్లి, కారుమంచి గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని క్రీడా మైదానాలను వ్యాయామ ఉపాధ్యాయులు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు సంయుక్తంగా పరిశీలించారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ప్రతి గ్రామంలో కమ్యూనిటీ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలన్నారు. జాబ్‌కార్డుల్లో వివరాల నమోదు అప్‌డేషన్ చేయాలన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఈ మేరకు ఏపీవో ఆంజనేయరాజు సమీక్షలో తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీబాషా, క్షేత్ర, సాంకేతిక సహాయకులు తదితరులు పాల్గొన్నారు.